క్లుప్తంగా

ఎల్ఆర్ఎస్ పరిశీలన వేగవంతం చేయాలి



ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్న దృశ్యం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఆర్ఎస్ పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ చింత వేణు తెలిపారు. శనివారం మున్సిపాలిటీలో చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియను డీటీసీపీఓ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 3,516 మంది లబ్ధిదారులు రూ.వెయ్యి ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోగా.. 1,086 దరఖాస్తులు పరిశీలించడం జరిగిందన్నారు. ఫోన్ల ద్వారా మరో 30 మంది ఆన్‌లైన్ చేసుకొని కాపీలను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఏదైనా సందేహాలుంటే హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ఇరిగేషన్ ఇంజినీర్ వెంకటరామ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకోటమైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువుతీరిన కోటమైసమ్మతల్లిని దేవాదాయ ధర్మదాయ శాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.సునీత, అడ్వకేట్ అమర్నాథ్ దంపతులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడె కొత్తలంక కైలాషశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, దేవాదాయ సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, లలిత్‌సాయి, మూడ్ మోహన్ చౌహాన్‌లు అసిస్టెంట్ కమిషనర్ దంపతులను సన్మానించారు.

విద్యుత్ శాఖ డీఈకి సన్మానం

మధిర: విద్యుత్ శాఖ వైరా డివిజన్ డీఈగా బాధ్యతలు చేపట్టిన బండి శ్రీనివాసరావును శనివారం సిరిపురం రైతు వేదికలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన గతంలో మధిర సబ్ డివిజన్ ఏడీఈగా పనిచేసి పదోన్నతిపై వైరా డివిజన్ డీఈగా విధులు నిర్వహించారు. ఈ ప్రాంత ప్రజలకు సుదీర్ఘకాలం సేవలు అందించి బదిలీపై నిర్మల్ వెళ్లి సాధారణ బదిలీల్లో భాగంగా తిరిగి వైరా డివిజన్ డీఈగా వచ్చారు. ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర సబ్ డివిజన్ ఏడీఈ అనురాధ, ఏఈలు అనీల్ కుమార్, నాగేశ్వరరావు, సిబ్బంది చెరుపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఏఈగా మనోహర్



మనోహర్

బోనకల్: మండల నూతన విద్యుత్ ఏఈగా టి.మనోహర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన డి.ఉమామహేశ్వర్ ఖమ్మంకు బదిలీ అయ్యారు.

దార్శనికుడు రతన్ టాటా

చింతకాని: రతన్ నావెల్ టాటా దేశం గర్వించదగిన గొప్ప వ్యాపార వేత్త అని శ్రీ ఆదర్శ విద్యాలయం కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ తెలిపారు. శనివారం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రతన్ టాటా జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చావా అరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి కల్యాణ వేదిక బహూకరణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని శ్రీ బాలా త్రిపురసుందరీ సహిత శ్రీచంద్రమౌళేశ్వరస్వామి ఆలయానికి(శివాలయం) శ్రీస్వామి వారి, అమ్మవార్ల కల్యాణ క్రతువు నిర్వహణకు గానూ మండలకేంద్రానికి చెందిన భక్తుడు గాదె గోపి రూ.2లక్షల విలువ చేసే వేదికను శనివారం బహూకరించారు. ఆలయానికి మండపాన్ని బహుకరించిన గోపిని ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు, అర్చకులు గోపాలకృష్ణశర్మలు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు కొత్తూరి రాజేష్, పలువురు అర్చకులు పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయండి

తల్లాడ: హైదరాబాద్‌లో ఆదివారం జరిగే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభలను విజయవంతం చేయాలనీ ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. తల్లాడలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాలపై ప్రభుత్వాలు అణచివేత, దోపిడి పెరుగుతుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు తీవ్రంగా ముందుకు వస్తున్నాయనీ తెలిపారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొణిజర్లలో వరుసగా వస్తున్న వాహనాలు



పల్లిపాడు సమీపంలో వాహనాల రద్దీ

రోడ్డు దాటేదెలా?

- భారీగా పెరిగిన ట్రాఫిక్
- రోడ్డుపై బారులుదీరుతున్న వాహనాలు
- జనాలకు తప్పని తిప్పలు
- డివైడర్లు ఏర్పాటు చేయాలంటున్న ప్రయాణికులు

కొణిజర్ల: మండలంలోని పలు గ్రామాల గుండా పోతున్న ఖమ్మం, రాజమండ్రి జాతీయ రహదారిపై రోజురోజుకు రద్దీ పెరుగుతుంది. వాహనాల సంఖ్య పెరగుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. విద్యార్థులు, పాదాచారులు, ప్రయాణికులు రోడ్డు దాటాలంటే అనేక ఇబ్బందులతో పాటు ప్రమాదాల భారీన పడుతున్నారు. మండలంలోని కొణిజర్ల, తనికెళ్ల, పల్లిపాడు గ్రామాల చుట్టు పక్కల పలు గ్రామాలకు కూడళ్లుగా ఉండడంతో పదుల సంఖ్యలో ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. సాయంత్రం అయితే చాలు ట్రాఫిక్ మరింత రద్దీగా ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతందో అని ప్రయాణికులు రోడ్డు దాటుతున్నారు.

రోడ్డు దాటాలంటే దడదడే..

కొణిజర్ల సెంటర్‌లో నిత్యం వందలాది మంది కార్మికులు ఖమ్మం పనులకు, విద్యార్థులు వివిధ కళాశాలలకు పోతుంటారు. ఈ క్రమంలో వీరంతా రోడ్డు దాటి బస్సులు, ఆటోలను ఆశ్రయించాలి. అయితే ఒక్కో సారి వాహనాల రద్దీ వల్ల ప్రమాదాలకు కూడా గురి అవుతున్నారు.

● కొణిజర్ల సెంటర్‌లోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉండటంలో సుమారు 200 మందికి పైగా చిన్నారులు రోడ్డు దాటి బడికి వెళ్లాలి. వారంతా వాహనాల రద్దీకి భయపడి పోతున్నారు.

● పల్లిపాడు సెంటర్లో ఖమ్మం వైరా రోడ్డుతో పాటు పల్లిపాడు ఏన్కూరు మీదుగా ఖమ్మం కొత్తగూడెంకు వెళ్లే వాహనాలు కూడా వచ్చి చేరుతుంటాయి. దీంతో పల్లిపాడు రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది.

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు..

బస్సులు ఎక్కే సమయంలో కూడా ఏ వాహనం ఎటునుంచి వస్తుందో అర్థంకాని పరిస్థితులలో ముందు వెనకా చూసుకుంటూ బస్సులు ఎక్కాల్సి వస్తుంది. వాహనాలు రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ద్విచక్రవాహనదారులు రోడ్డుపై ప్రయాణించడానికి కూడా భయపడుతున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఒకరిని మించి మరొకరు వాహనాలను ఓవర్ టేక్ చేస్తూ దూసుక వస్తుండటంతో ఎప్పుడు ఏ వాహనం వచ్చి ఢీ కొడుతుందోననే భయపడుతూ ప్రయాణాలు చేస్తున్నారు. అధికారులు స్పందించి డివైడర్లు ఏర్పాటు చేస్తే రోడ్డు దాటేందుకు వెసులుబాటుగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

భయంగా ఉంది.



స్వయం సహాయక సంఘం పని మీద నిత్యం కొణిజర్ల రావాల్సి ఉంటుంది. రోడ్డు దాటాలంటే ఎటునుంచి ఏ వాహనం వచ్చి ఢీ కొడుతుందోనని భయం వేస్తుంది. సుమారు 5 నుంచి 10 నిమిషాలు రోడ్డు పక్కన నిలుచుని రోడ్డు దాటాల్సి వస్తుంది. స్పీడ్ బ్రేకర్లు ఉన్నా వాహనాలు స్పీడ్‌గానే వస్తున్నాయి. – రమణ, బస్వాపురం

డివైడర్లు ఏర్పాటు చేయాలి..



కొణిజర్ల, తనికెళ్ల, పల్లిపాడు సెంటర్లలో డివైడర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే వాహనాల రద్దీ చాలా వరకు తగ్గించవచ్చు. పల్లిపాడు మీదుగా ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్లే వాహనాలు కూడా వచ్చి కలుస్తుండటంతో పల్లిపాడులో ట్రాఫిక్ రద్దీ బాగా ఉంటుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి డివైడర్లు ఏర్పాటు చేయించాలి. – షేక్.కరీమ్, కొణిజర్ల

అంకితభావంతో పనిచేయాలి



మధిర: సర్వీస్ రిజిస్టర్లు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మధిర: ఇటీవల ఉద్యోగంలో చేరిన నూతన ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్ బ్రహ్మారెడ్డి తెలిపారు. నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు, ఉద్యోగి గుర్తింపు కార్డులు, ఫిజికల్ ఫిట్‌నెస్ ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఉపాధ్యాయులు తమ సంఘ సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, సుధాకర్, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తల్లాడ: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటం జరుగుతుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని పాఠశాలల్లో విధుల్లో చేరిన 27మంది ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సంఘం ఎస్ఆర్ సర్వీస్ రిజిస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా బిల్లుపాడు పాఠశాలలో జరిగిన సమావేశంలో యలమద్ది మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు నరసింహారావు, జిల్లా కౌన్సిలర్ ఏడు కొండలు, జిల్లా కార్యదర్శి శ్రీనువాసరావు, మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గోపాలక్రిష్ణ, శర్మ, భాస్కర్, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ మండల కమిటీ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి సర్వీస్ రిజిస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్లకు సర్వీస్ ఇవ్వడంలో పీఆర్‌టీయూ ముందుంటుందన్నారు. సంఘం నాయకులు, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, సంగిరెడ్డి, నాగరాజు, బాబురావు, రాఘవరావు, లుక్యా, స్రవంతి, కుటుంబరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



చింతకాని: కొదుమూరు ఉన్నత పాఠశాలలో కన్నయ్యను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

చింతకాని: మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తల్లిదండ్రుల్లో ఒకరైన బస్వాపురం గ్రామానికి చెందిన దొడ్డ కన్నయ్యను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సన్మానించారు. కన్నయ్య ఫైర్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగం చేస్తూ.. ఇటీవల నిర్వహించిన డీఎస్సీల్లో ర్యాంక్ పొంది స్కూల్ అసిస్టెంట్‌గా ముదిగొండ మండలం పండ్రేగుపల్లి పాఠశాలలో చేరారని తెలిపారు. అతని పిల్లలను కూడా.. కొదుమూరు ఉన్నత పాఠశాలలోనే చదివిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

● కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పి.రమాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, కె.విజయ్‌కుమార్, ఎస్.కృష్ణ, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.75 వేల విలువైన మెటీరియల్ పంపిణీ..



విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లితండ్రుల సమావేశానికి తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకులు ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు రూ.75 వేల విలువైన నోట్ పుస్తకాలు, తదితర వస్తువులను అందించారు. అనంతరం సాదిక్ అలీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగపద్మ, ఉపాధ్యాయులు వరకా రామారావు, రమాదేవి, వెంకటేశ్వరరావు, అనిత, ఫణి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

ఏన్కూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని లచ్చగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సొసైటి అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరావు, స్వర్ణ నరేందర్, వేముల కృష్ణ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మాదిని రవి, సీఈఓ శ్రీనివాసరావు, సొసైటీ డైరక్టర్లు తూము కోటేశ్వరరావు, మనోహర్‌బాబు, గోవిందరావు, రామారావు, బాబు, ఐకేపీ ఏపీఎం తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమ్మేళనంలో భాగస్వాములు కావాలి

వైరా: ఖమ్మంలో నవంబర్ 5న నిర్వహించే రాష్ట్ర సాయి గిరిజన సమ్మేళనం జయప్రదం చేయుటకు అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు పిలుపునిచ్చారు. శనివారం వైరాలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన సమ్మేళనం ప్రచార కరపత్రాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామవత్ శ్రీరాం నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రంతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాన్ని ప్రారంభించిన ఎంపీ

కొణిజర్ల: మండలం తనికెళ్ల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస ఫైర్ వర్క్ టపాసుల దుకాణాన్ని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు అందుబాటులో హోల్ సేల్ దుకాణాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఎటువంటి ప్రమాదాలకు చోటు లేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకుని టపాసుల అమ్మకాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో దుకాణ యజమానులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

కుట్టు మిషన్..

వైరా: వైరాలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళ మిట్టపల్లి లక్ష్మీ కుట్టు మిషన్‌ను వితరణగా అందజేశారు. అలాగే కొత్తూరు రమణకు 25 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి విశ్వేశ్వరరావు, సుబ్బారావు, కృష్ణామూర్తి, సత్యంబాబు, నాగి, సుధాకర్, ప్రసాద్, వాసు, కృష్ణామూర్తి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్..

ఎర్రుపాలెం: మండలంలోని మాములనూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన జి.విజయశ్రీ రూ.1.50 లక్షల విలువైన మినరల్ వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్ వితరణ చేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్యూరిఫైర్ ప్లాంట్‌ను దాత విజయశ్రీ లాంఛనంగా ప్రారంభించారు. దాత విజయశ్రీ వితరణను పాఠశాల హెచ్ఎం శ్యాంబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు, రిటైర్డ్ టీచర్ శివాజీ, అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జమలయ్య, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు..

కల్లూరు: అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడిన శిల్ప సుదీప్త్ పోణంగి తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకుడు ఎస్‌కే సాధిక్ అలీ స్నేహితుడు గోవిందరాజు చక్రదర్ కుమార్తె తోపుడుబండి కార్యక్రమాలు తెలుసుకుని పల్లె పిల్లలకు చదువుల కోసం తన వంతు సహాయం చేస్తానంటు ముందుకొచ్చింది. కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల, చంద్రుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు 35మంది ఈ ఏడాది ఎన్ఎమ్ఎమ్ఎస్ పరీక్ష రాసేందుకు శిల్ప రూ.10 వేలు అందచేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం..

వైరా: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం తాటిపూడి గ్రామానికి చెందిన రామాంజరపు రాధకు డీఎస్సీ కోచింగ్ నిమిత్తం రూ.5 వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో డిస్టిక్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, బాధ్యులు ఉంద్రూ శ్యాంబాబు, వెంకటేశ్వరరావు, ఉపేంద్రరావు, రాంగోపాల్, నాగేశ్వరరావు, రాజారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి..

కారేపల్లి: కారేపల్లి యాదవ్ బజార్‌కు చెందిన రాబోతు కుమార్ కిడ్నీ సమస్యతో పాటు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. కాగా.. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబంలో ఇంటి పెద్ద అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో చలించిన కారేపల్లి జామే మసీదు మాజీ అధ్యక్షుడు షేక్ గౌసుద్దీన్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.

కోళ్లఫారం నిర్వాహకుడికి..

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్ జంగాల కాలనీకి చెందిన కోళ్లఫారం నిర్వాహకుడు తూరపాటి అబ్బుస్వామికి ప్రభుత్వం మంజూరీ చేసిన రూ.10 వేల చెక్కును శనివారం మండల కాంగ్రెస్ నాయకులు అందించారు. తుఫాన్ ప్రభావంతో కోళ్లఫారంలోని కోళ్లు మృతి చెందగా.. ఎమ్మెల్యే రాగమయి అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిరణ్, కాంతయ్య, రమేష్, నిరంజన్ గౌడ్, రాజబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి..

వైరారూరల్: వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన వృద్ధురాలు గుడిపాటి రత్తమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందగా.. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు వారి కుటుంబాన్ని పరామర్శించి శనివారం వారికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధి నిమ్మతోట జాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కారేపల్లి: బిర్యానీ హోటళ్ల ఎదుట ఏర్పాటు చేసిన ఫెక్సీలను చింపేసిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. కారేపల్లి అంబేద్కర్ సెంటర్‌లో ప్రేమ్‌కుమార్, సాగర్ ల బిర్యానీ పాయింట్ల ముందు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే సెంటర్లో మరో బిర్యానీ హోటల్‌లో మాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి రాత్రి సమయాల్లో మద్యం సేవించి ఓర్వలేక ఫ్లెక్సీలను చింపివేయడంతో పాటు వస్తువులను ధ్వంసం చేశాడు. ఈ ఘటనలు సీసీలో రికార్డు కావడంతో.. బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమిషనర్‌గా సంపత్ కుమార్ బాధ్యతలు



సంపత్ కుమార్

మధిర: మధిర మున్సిపల్ నూతన కమిషనర్‌గా సంపత్ కుమార్ శనివారం మధిర మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మధిరలో పనిచేసిన షఫీ ఉల్లా ఖమ్మం కార్పొరేషన్‌కు బదిలీ కావడంతో.. అక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన మధిర మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మధిర ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌బాబు తెలిపారు. సత్తుపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని సత్తుపల్లిటౌన్-1 ఫీడర్‌లో ఫీడర్ మెయిటినెన్స్ నిమిత్తం జలగంనగర్, వేంసూరురోడ్, ఎన్టీఆర్‌నగర్, కృషి బైపాస్‌రోడ్, విద్యానగర్, వాణి విద్యాలయం, మిస్ట్ కళాశాల ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడుతుందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ముదిగొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పానుకుల సుధాకర్ అన్నారు. శనివారం ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. అనంతరం కళాశాల నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా చరణ్, మధునాయక్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగచైతన్య, వినీత్, రాజేష్, నాగరాజులు పాల్గొన్నారు.

పాస్టర్ల మండల కమిటీ ఎన్నిక

పెనుబల్లి: పెనుబల్లి మండల పాస్టర్ల మండల కమిటీని శనివారం ఏ గ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల నూతన అధ్యక్షుడు బ్రదర్ కోట దేవదానం తెలిపారు. శనివారం మండలంలోని కొండ్రుపాడు మిస్పా ప్రార్థన మందిరంలో పాస్టర్ మేషక్ అధ్యక్షతన నిర్వహించిన సేవకుల సమావేశంలో అసోసియేషన్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రెవ॥ పి.ఎనోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పాస్టర్లకు సంక్షేమ పథకాలు అందేలా చూడాన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు కోట దేవదానం, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి జాన్, కోశాధికారి ఐజాక్, గౌరవ అధ్యక్షులు మెషక్, నతానీయేలు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు డేవిడ్, సంజీవరావు, దాసు, రాజు, పరంజ్యోతి, సుందర్ రాజు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.


ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

మధిరరూరల్: మండలంలోని సిరిపురం ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఉపాధిహామీ కూలీలు శనివారం డిమాండ్ చేశారు. ఏప్రిల్ ఒకటో తారీకు నుంచి సెప్టెంబర్ 24 వరకు వారు పనిచేయగా.. ప్రతీ నెల నాలుగు వారాలకు గానూ.. రెండువారాలు మాత్రమే హాజరు వేసింది. దీంతో వర్కర్లకు రెండువారాల నగదు అకౌంట్‌లో జమకాలేదు. ఇదేంటని ప్రశ్నిస్తే.. నాకు సంబంధం లేదని సమాధానమిస్తున్నారని తెలిపారు. బ్యాంక్‌కు వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకుంటే రెండువారాల కూలీ మాత్రమే జమ అయ్యిందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ హాజరు వేయకపోవడం వల్లనే ఇలా జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కూలీ డబ్బులు ఇప్పించాలని ఉపాధి కూలీలు తేళ్లూరి ఆశోక్‌గ్రూప్, తడకమళ్ల వెంకట్రావమ్మ గ్రూప్ సభ్యులు కోరారు.

'చిన్నారి'పై అవగాహన

మధిర: మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో శనివారం బాలికలకు 'చిన్నారి'కార్యక్రమంపై అవగాహన కల్పించారు. చిన్నారి పైలట్ ప్రాజెక్టు టీం సభ్యులు నస్రీన్, హేమలత పాల్గొని మాట్లాడుతూ.. పిల్లలకు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, బాల్య వివాహాలు, బాల కార్మికులు, ఇంటర్‌నెట్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వారు బొమ్మతో గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఫౌండేషన్ పాఠశాల విద్యార్థినిలు, ఐసీడీఎస్ సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సునీల్ మాదిగ

మధిరరూరల్/సత్తుపల్లిరూరల్: ఖమ్మంలో ఈనెల 25న జరగబోయే మాదిగల ధర్మ యుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ, ఈ సంఘం జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మధిరలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఎమ్మార్పీఎస్ మధిర మండల అధ్యక్షులు కొండూరు రాజేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే విధంగా సత్తుపల్లిరూరల్‌లోని కళాభారతిలో జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాదిగలు యుద్ధానికి సిద్ధం కావాలని కోరారు. ఈనెల 25న జరగబోయే మహాసభకు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభకు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, అభిమానులు అదే సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీను మాదిగ, రత్నాకర్ మాదిగ, నాగరాజు, నాగేశ్వరరావు, రవీంద్ర, ఉపేంద్ర, దాసు, తదితరులు పాల్గొన్నారు.